మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి టౌన్, ఆగస్టు 12 : యువత మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. జాతీయ యువజన దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో ఆయన అధికారులతో నిర్వహించిన సమావేశంలో జిల్లాలోని యువతకు యువజన దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండి బాగా చదువుకొని ఉన్నత లక్ష్యాలు సాధించాలని ఆకాంక్షించారు. నషా ముక్త్ భారత్ కింద యువతను మాదక ద్రవ్యాల వినియోగం నుంచి దూరంగా ఉంచేందుకు సమాజంలో అందరూ కృషి చేయాలన్నారు. అనంతరం అదనపు ఎస్పీ రామదాస్ తేజావత్ ప్రతిజ్ఞ చేయించగా కలెక్టర్‌తో పాటు అధికారులు ప్రతిజ్ఞ చేశారు.

పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలి

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. వేడుకలను పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని , కార్యక్రమ ప్రోటోకాల్ నోడల్ అధికారిగా ఆర్డీవోను నియమిస్తున్నట్లు తెలిపారు. షామియానా, కూర్చోవడానికి ఏర్పాట్లు, ఆహ్వాన పత్రికలు పంపించడం వంటివి చూసుకోవాలని ఆర్డీవోను ఆదేశించారు. పూలతో వేదిక అలంకరణ తదితర ఏర్పాట్లు ఉద్యానవన శాఖ అధికారి, పోలీస్ బందోబస్త్ గార్డ్ ఆఫ్ ఆనర్ జిల్లా పోలీస్ శాఖకు అప్పగించారు. ప్రభుత్వ కార్యాలయాలకు త్రివర్ణ రంగుల్లో విద్యుత్ దీపాలంకరణ చేయాలని, స్టాల్స్ , ప్రథమ చికిత్స, ఫైర్ ఇంజన్ ఏర్పాట్లు చేయాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ నగేశ్, అదనపు ఎస్పీ రామదాస్ తేజావత్ అధికారులు ఉన్నారు.

పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలి

వనపర్తి టౌన్, ఆగస్టు 12 : ప్రజావాణికి వచ్చే ఫిర్యాదులను పెండింగ్‌లో లేకుండా చూసుకోవాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్లు సంచిత్ గంగ్వార్, నగేశ్‌తో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పర్యాటక శాఖ మంత్రి జూపల్లి ప్రజల నుంచి వచ్చిన 177 ఫిర్యాదులను ఆయా శాఖలకు పంపారని వాటిని రెండు రోజుల్లో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణికి మొత్తం

మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

78ఫిర్యాదులు అందాయని ఆయన చెప్పారు. కార్యక్రమంలో భూసేకరణ ఉప కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విద్యారంగాభివృద్ధికి విశేష కృషి

పాఠశాల ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

- ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గద్వాలటౌన్, ఆగస్టు 12: విద్యారంగాభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల గ్రౌండ్, తరగతి గదులను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలసి ప్రార్థనలో పాల్గొన్నారు. తాను ఎమ్మెల్యే గెలిచిన తర్వాత మొదటి ప్రాధాన్యత విద్యారంగం అభివృద్ధికే ఇచ్చినట్లు తెలిపారు. ఇప్పటికే జూనియర్ కళాశాలలు, గురుకులాలు, నర్సింగ్ , మెడికల్ కళాశాలలు తీసుకొచ్చినట్లు గుర్తుచేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జహిరుద్దీన్, నాయకులు పాల్గొన్నారు.

డయల్ 100 కాల్స్‌పై తక్షణమే స్పందించాలి

గద్వాల టౌన్ పోలీస్ స్టేషన్ పరిశీలిస్తున్న ఎస్పీ తోట శ్రీనివాసరావు

గద్వాల అర్బన్, ఆగస్టు 12 : బాధితుల నుంచి వచ్చిన డయల్ 100 కాల్స్‌పై తక్షణమే స్పందించి ఘటనా స్థలానికి చేరుకొని వారి సమస్య పరిష్కరించాలని ఎస్పీ తోట శ్రీనివాసరావు పోలీస్ అధికారులకు సూచించారు. జిల్లాకేంద్రంలోని గద్వాల టౌన్ పోలీస్ స్టేషన్‌ను సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో గస్తీ నిర్వహించాలని అనుమానిత ప్రదేశాలలో నిఘా పెట్టాలని సూచించారు. ఎస్పీ వెంట డీఎస్పీ సత్యనారాయణ, సీఐ భీంకుమార్, ఎస్సై శ్రీనివాస్ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

బాధితుల సమస్యల పరిష్కారానికి పోలీస్ శాఖ పూర్తిస్థాయిలో కృషి చేస్తుందని ఎస్పీ తోట శ్రీనివాసరావు పేర్కొన్నారు. సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణికి జిల్లా వ్యాప్తంగా 13 ఫిర్యాదులు వచ్చాయన్నారు.

వనపర్తిలో 10 ఫిర్యాదులు

వనపర్తి టౌన్, ఆగస్టు 12 : జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పోలీస్ ప్రజావాణికి 10 ఫిర్యాదులు అందాయని ఎస్పీ రావుల గిరిధర్ తెలిపారు. ఫిర్యాదుదారుల సమస్యలను తెలుసుకొని వాటిని చట్టప్రకారం పరిష్కరించాలని అధికారులకు సూచించారు.

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

- కలెక్టర్ సంతోష్

గద్వాల, ఆగస్టు12: స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సంతోష్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో అధికారులతో సోమవారం కలెక్టర్ సన్నాక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఆయా శాఖల వారీగా అధికారులకు ఆదేశాలు జారీచేశారు. పోలీస్ పరేడ్ మైదానంలో వేడుకలు నిర్వహిస్తున్నందువల్ల అందుకు అనుగుణంగా వేదిక సిద్ధం చేసి సీటింగ్ ఏర్పాట్లు పక్కాగా చేసుకోవాలని సూచించారు. అత్యవసర పరిస్థితిలో తక్షణ చికిత్స అందించేలా వైద్య బృందాన్ని వేడుక స్థలం వద్ద అందుబాటులో ఉంచాలన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు ప్రతిబింబించేలా జిల్లా ప్రగతి నివేదిక రూపొందించాలని ఆదేశించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, వ్యవసాయ, స్త్రీ శిశుసంక్షేమ తదితర శాఖల పనితీరును చాటేలా స్టాల్స్ ఏర్పాటు చేయాలన్నారు. ప్రోటోకాల్ అనుసరిస్తూ అతిథులకు ఆహ్వానాలు పంపాలని, విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ఉత్తమ ఉద్యోగుల ఎంపిక కోసం శాఖల వారీగా ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీనివాస్‌రావు, ఆర్డీవో రాంచందర్ పాల్గొన్నారు.

ప్రజా ఫిర్యాదులపై నిర్లక్ష్యం వహించొద్దు..

ప్రజా ఫిర్యాదులపై అధికారులు నిర్లక్ష్యం వహించొద్దని కలెక్టర్ అధికారులకు సూచించారు. ప్రజల నుంచి వచ్చిన దరఖాస్తులను వెంటనే పరిష్కరించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సంతోష్ అధికారులకు ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని వివిధ సమస్యలపై వచ్చిన ప్రజా ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజావాణికి మొత్తం 35 ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ తెలిపారు. వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో ఉంచకుండా బాధితులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఎస్డీసీ శ్రీనివాసరావు, ఆర్డీవో రాంచందర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కలెక్టర్

తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలి

అలంపూర్, ఆగస్టు 12 : తపాలాశాఖ ద్వారా అందించే సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని శాఖ సహాయ సంచాలకుడు సైదానాయక్ సూచించారు. సోమవారం మండలంలోని బుక్కాపురం బ్రాంచ్ పోస్ట్‌మాస్టర్ నారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన డాక్ డెవలప్‌మెంట్ కార్యక్రమంలో భాగంగా పొదుపు పథకాలైన ఎస్‌బీ, ఆర్‌డీ, సుకన్య, పీపీఎఫ్, ఎంఐఎస్‌పై అవగాహన పొదుపు చేసుకోవడం ద్వారా రేపటి తరానికి భరోసాగా కల్పించవచ్చన్నారు. కార్యక్రమంలో అలంపూర్ బ్రాంచి పోస్ట్‌మాస్టర్ రవిచంద్ర, సుధాకర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

రేపు ఉద్యోగ మేళా

వనపర్తి టౌన్, ఆగస్టు 12: జిల్లా కేంద్రంలోని రామాలయం సమీపంలోనని శిశుమందిర్ పాఠశాలలో ఈనెల 14వ తేదీన ఉద్యోగ మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి మహ్మద్ జాని పాషా సోమవారం ప్రకటనలో తెలిపారు. మొత్తం 1110 ఉద్యోగ ఖాళీల భర్తీ కోసం ఉద్యోగ మేళాను నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎస్ఎస్సీ, ఇంటర్, డిగ్రీ, బీటెక్ అర్హత కలిగి ఉండి, 18నుంచి 30 ఏండ్ల వయస్సు గల వారు అర్హులని, అభ్యర్థులు సర్టిఫికేట్ , ఆధార్, బయోడేటా ఫారంతో ఉద్యోగ మేళాకు హాజరు కావాలని సూచించారు. వివరాలకు 9948568830 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుందాం

అమరచింత, ఆగస్టు 12: స్వాతంత్ర్య సమరయోధులను స్మరించుకుని వారి ఆశయ సాధనకు కృషి చేద్దామని బీజేపీ రాష్ట్ర నాయకుడు మేర్వరాజు, పట్టణ అధ్యక్షుడు క్యామ భాస్కర్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో హర్ ఘర్ తిరంగా యాత్రలో భాగంగా సోమవారం పాత బస్టాండ్ ఆవరణలో జాతిపిత మహాత్మాగాంధీ, అంబేద్కర్ విగ్రహాలతోపాటు పరిసరాలను శుభ్రం చేసిన విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాసయాదవ్, అనిల్, భరత్, నారాల సిద్ధురాములు ఉన్నారు.

కాల్వకు మరమ్మతులు

ఆత్మకూరు, ఆగస్టు 12: మండలంలోని పిన్నెంచెర్ల గ్రామ శివారులోని బీమాఫేజ్ -2 కాల్వలో కంపచెట్లు , మట్టి దిబ్బలు నీటి ప్రవాహానికి అడ్డంకిగా మారాయి. దీంతో రైతులు సమస్యను ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన ఎమ్మెల్యే జేసీబీ సాయంతో కాల్వలో మొలిచిన ముళ్లపొదలు తొలగించి, నీటి ప్రవాహం సాఫీగా సాగేలా చర్యలు తీసుకోవాలని గ్రామ కార్యకర్తలకు సూచించారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు సోమవారం గ్రామానికి చెందిన నాయకులు పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో హుజూర్, రాములు, విజయలక్ష్మి, ఖాజన్న, సత్తన్న, విష్ణు, వెంకటేశ్, జగన్, మున్నూరు శ్రీను, మల్లేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

కాల్వకు సాగునీటి విడుదల

గోపాల్‌పేట, ఆగస్టు 12 : రైతులకు సాగునీరు అందించేందుకు ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి, కాంగ్రెస్ ఉమ్మడి మండల ఇన్‌చార్జి మంద సత్యశీలారెడ్డి చొరవతో మండలంలోని చాకల్‌పల్లి శివారులో కేఎల్ఐ మైనర్- 4కాల్వకు వారం రోజులు మరమ్మతులు చేశారు. సోమవారం డీ-8 కాల్వ నుంచి మైనర్ -4 కాల్వ గుండా నీటిని విడుదల చేశారు. ఈ కాల్వ ద్వారా గ్రామ శివారులో 3కుంటలు నిండి ఏడుట్ల చెరువుకు నీళ్లు వస్తున్నట్లు రైతులు తెలిపారు.

చెరువు మట్టి తరలింపు నిలిపివేయాలి

అయిజ, ఆగస్టు 12 : పట్టణ సమీపంలోని బింగిదొడ్డి చెరువు (మినీ ట్యాంక్ బండ్)లోని మట్టిని భారత్‌మాల కాంట్రాక్టర్లు అక్రమంగా తరలిస్తున్నారని, నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని అయిజ శ్రీలక్ష్మీదేవి మత్స్యపారిశ్రామిక సహకార సంఘం సభ్యులు కలెక్టర్ సంతోష్‌ను కోరారు. సోమవారం కలెక్టరేట్‌లోని ప్రజావాణిలో ఈ మేరకు వినతిపత్రం అందజేశారు. చెరువు మట్టి తరలింపుతో ఉపాధి కోల్పోయే అవకాశం ఉందని, అడ్డుకుని చెరువుకు నెట్టెంపాడ్ నీటిని విడుదల చేయాలని కోరారు. అనంతరం భారత్‌మాల రోడ్డు మేనేజర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మత్స్యపారిశ్రామిక సంఘం సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి

ఉండవెల్లి, ఆగస్టు 12 : పత్తిలో యాజమాన్య పద్ధతులు పాటించాలని ఏడీఏ సక్రియానాయక్ రైతులకు సూచించారు. మండలంలోని బైరాపురం, బస్వాపురం గ్రామాల్లో పత్తి పంటలను ఏడీఏ రైతులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు రోజులుగా విస్తారంగా వర్షాలు కురుస్తున్నందునా వర్షపు నీరు నిల్వలేకుండా చూసుకోవాలన్నారు. నీళ్లు నిల్వ ఉంటే పత్తి మొక్కలు చనిపోయే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఏఈవో హసీనాబేగం, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ఆవిర్భావ దినోత్సవం

వనపర్తి టౌన్, ఆగస్టు 12 : జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో సోమవారం ఏఐఎస్ఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ముందుగా ఏఐఎస్ఎఫ్ జిల్లా ఇన్‌చార్జి రమేశ్, విద్యార్థి సంఘం మాజీ నాయకుడు గోపాలకృష్ణల ఆధ్వర్యంలో ర్యాలీ, జెండా ఆవిష్కరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వెంటనే ప్రభుత్వం విద్యా వ్యవస్థలో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరేశ్, డివిజన్ కార్యదర్శి వంశీ, చంద్రశేఖర్, మహేశ్, మోహన్, విష్ణు, అశోక్, రాము, రాంబాబు, శివయాదవ్ , విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల భాగస్వామ్యం ఎంతో అవసరం

ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

గద్వాలటౌన్/గద్వాల రూరల్, ఆగస్టు 12 : మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణంలో విద్యార్థులు భాగస్వామ్యం ఎంతో అవసరమని పీజీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటరెడ్డి అన్నారు. జిల్లా కేంద్రం సమీపం నది అగ్రహారంలోని పీజీ కళాశాలలో నషాముక్త్‌భారత్‌అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాలకు బానిసలైతే ఆరోగ్యం, ఆర్థికంగాను దెబ్బతినే అవకాశం ఉందన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసులు, గోపినాథ్‌రాథోడ్, మహ్మద్ రఫి పాల్గొన్నారు.

ఉద్యోగ భద్రత కల్పించాలి

ఖిల్లాఘణపురం, ఆగస్టు 12 : రాష్ట్రంలోని సమగ్ర శిక్ష అభియాన్‌లో పనిచేస్తున్న ఉద్యోగులందరికీ ఉద్యోగ భద్రత కల్పించాలని ఎంఐఎస్ కో-ఆర్డినేటర్ తిరుపతయ్య అన్నారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ భవనంలో సోమవారం మృతిచెందిన సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు భోజన విరామ సమయంలో నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలంగాణ ఎస్ఎస్ఏ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత లేనందున తక్కువ వేతనాలతో పాటు పని ఒత్తిడి పెరిగి గుండెపోటుతో ప్రతి నెలా ఇద్దరు చొప్పున మృతిచెందుతున్నారన్నారు. ఎస్ఎస్ఏ ఉద్యోగులందరిని రెగ్యులరైజ్ చేయాలని, బేసిక్ పే అమలు చేయాలని, ఆరోగ్య బీమా రూ.5లక్షలు , జీవిత బీమా రూ.10లక్షల సౌకర్యం కల్పించాలని, ఉద్యోగ విరమణ చేసిన వారికి రూ.10లక్షల రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలని, మరణించిన వారి కుటుంబంలో ఒకరికి ప్రభుత్వంలో గాని సమగ్ర శిక్షలో ఉద్యోగం కల్పించాలన్నారు. ప్రభుత్వం మానవతా దృక్పథంతో సమస్యలను పరిష్కరించాలని లేకపోతే దశలవారీగా నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. కార్యక్రమంలో సీసీవో పవన్‌కుమార్, సీఆర్‌పీ వెంకటేశ్, రజిత, మల్లీశ్వరి, దేవేందర్, సుమేద, సుమలత, అర్జున్ తదితరులు పాల్గొన్నారు.

ఓపెన్ ఇంటర్‌కు దరఖాస్తుల ఆహ్వానం

వడ్డేపల్లి, ఆగస్టు 12 : ఓపెన్ ఇంటర్‌లో చేరేందుకు దరఖాస్తు చేసుకోవాలని శాంతినగర్ జెడ్పీహెచ్ఎస్ హెచ్ఎం కేవీ రావు సోమవారం ప్రకటనలో పేర్కొన్నారు. పదో తరగతి పాసైనా, కాకపోయినా, చదువు మధ్యలో మానేసిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సెప్టెంబర్ 10వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు పాఠశాల కోఆర్డినేటర్ శేషన్‌ను గానీ లేదా 988 5994554 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

FARM PLOTS SALE
★బాలానగర్ జడ్చర్ల బెంగుళూరు హైవేకి
గజం: 3,999/- శ్రీగంధం చెట్లతో & యాచారం సాగర్ హైవే గజం: 4,999/- ప్రూట్ ప్లాంటేషన్‌తో ఫార్మాసిటీ, RRRకి దగ్గరలో, స్పాట్ రిజి|| 7780483434.
NT-332573

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములలో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777794

కలెక్టర్ చేతుల మీదుగా ఏజీపీగా నియామకపత్రం అందుకుంటున్న మధు

మున్సిఫ్ కోర్టు ఏజీపీగా మధు

అలంపూర్, ఆగస్టు 12 : అలంపూర్ మున్సిఫ్ కోర్టు ఏజీపీగా మధు నియమితులయ్యారు. ఈ మేరకు కలెక్టర్ బీఎం సంతోష్ చేతుల మీదుగా నియామకపత్రం సోమవారం అందుకున్నారు. కార్యక్రమంలో నాయకులు ఇస్మాయిల్, బైరాపురం రమణ తదితరులు పాల్గొన్నారు.

14న శాంతియుత ర్యాలీ, బంద్

వనపర్తి టౌన్, ఆగస్టు 12: బంగ్లాదేశ్‌లో హిందువులపై , ఆలయాలపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ ఈనెల 14వ తేదీన శాంతియుత ర్యాలీ, బంద్‌కు పిలుపునిస్తున్నట్లు హిందువాహిని జిల్లా కన్వీనర్ అభిలాశ్ సోమవారం ప్రకటనలో తెలిపారు. 14న బుధవారం స్వచ్ఛందంగా జిల్లాలోని అన్ని వ్యాపార సంస్థలు, విద్యా సంస్థలు, హోటళ్లు, షాపింగ్ మాల్స్‌ను బంద్ చేయాలని ఆయన కోరారు.

చేతి పంపునకు మరమ్మతులు

వీపనగండ్ల, ఆగస్టు12 : మండలకేంద్రం సమీపంలోని రంగారెడ్డి మైసమ్మ దేవత ఆలయం ఆవరణలోని చేతి పంపు మరమ్మతులకు నోచుకోకపోవడంతో..మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ మండల నాయకుడు ముంత మల్లయ్య యాదవ్ సోమవారం సొంత ఖర్చులతో మరమ్మతు చేయించాడు. భక్తులు ఇబ్బందులు పడకుండా బోరుకు మరమ్మతులు చేయించినట్లు ముంత మల్లయ్య యాదవ్ తెలిపారు.

ఉత్తమ ర్యాంకులు సాధించిన డబ్ల్యూసీసీఎం విద్యార్థులు

వనపర్తి టౌన్, ఆగస్టు 12: రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన పీజీసెట్ ఫలితాలలో జిల్లా కేంద్రంలోని డబ్ల్యూసీసీఎం కళాశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించినట్లు కళాశాల ప్రిన్సిపాల్ లక్ష్మారెడ్డి తెలిపారు. కళాశాలకు చెందిన పి.అస్మ జువాలజీలో 18వ ర్యాంకు, బయోటెక్నాలజీలో 60, హేమలత గౌరి ఇంగ్లిష్‌లో 135, మైక్రో బయాలజీలో 384వ ర్యాంకు, శివకుమార్ ఎంటీఎంలో 54వ ర్యాంకు, ఎన్.మేఘన ఎంకాంలో 338, ఆర్.సాయి అంకిత మాస్టల్ ఆఫ్ హ్యూమన్ రిసెర్చ్‌లో 161వ ర్యాంకు, జ్యోత్స్నారాణి బయోటెక్నాలజీలో 522వ ర్యాంకులు సాధించినట్లు చెప్పారు. ఉత్తమ ఫలితాలు సాధించిన వీరిని ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు శివకుమార్, ప్రతిమ, కరుణాకర్, బాలరాజు, లక్ష్మణ్, రామకృష్ణ అభినందించారు.

సీఎం సహాయనిధి చెక్కు అందజేత

ఖిల్లాఘణపురం, ఆగస్టు 12 : మండలంలోని మామిడిమాడ గ్రామానికి చెందిన ఇంతియాజ్‌కు మంజూరైన సీఎం సహాయనిధి రూ.60వేల చెక్కును సోమవారం రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు చిన్నారెడ్డి జిల్లా కేంద్రంలోని తన స్వగృహంలో బాధితుడికి అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు తదితరులు ఉన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

పాన్‌గల్,ఆగస్టు12;మండలంలోని రేమద్దుల గ్రామానికి చెందిన శేఖరయ్య, నీలం ఆనందంకు మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మండల నాయకులు మధుసూదన్‌రెడ్డి, గోపాల్‌రావు, మాజీ ఉపసర్పంచ్ గంధం రాంబాబు పంపిణీ చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడు తూ శేఖరయ్యకు రూ.37,500,నీలం ఆనందంకు రూ.25వేలు మంజూరయ్యాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో సింగిల్‌విండో డైరెక్టర్ ప్రసాద్‌రావు, గోపాల్‌రెడ్డి, రాములు, నర్సింహ, హనుమంతు పాల్గొన్నారు.

మహనీయుల విగ్రహాలు శుభ్రం

అయిజ, ఆగస్టు 12 : హర్ ఘర్ తిరంగ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం పట్టణంలోని మహాత్మా గాంధీ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాలను శుభ్రపర్చారు. స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని దేశ నాయకులు, స్వాతంత్ర్య సమరయోధులకు నివాళులర్పిస్తుండటంతో విగ్రహాల పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూస్తున్నామని బీజేపీ నాయకులు తెలిపారు. అనంతరం పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో భగత్‌రెడ్డి, భీంసేన్‌రావు, వెంకటేశ్ యాదవ్, ప్రదీప్‌కుమార్, లక్ష్మన్న గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డబ్బులు బీఆర్ఎస్‌వి..గొప్పలు కాంగ్రెస్‌వి..

- దేవరకద్ర నియోజక బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు జయంతి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు జయంతి

మదనాపురం, ఆగస్టు 12 : బీఆర్ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి పనులకు రంగులువేసి కాంగ్రెస్ నాయకులు ప్రారంభోత్సవాలు చేసి అంతా తామే చేశామని చెప్పుకోవడం ఎంతవరకు సమంజసమని బీఆర్ఎస్ దేవరకద్ర నియోజక బీఆర్ఎస్ మహిళా అధ్యక్షురాలు జయంతి ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులతో కలిసి కొన్నూరు గ్రామంలో తన నివాసంలో సోమవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో గ్రామానికి చెందిన కొంతమంది కాంగ్రెస్ నాయకులు సొంత డబ్బులతో అంగన్‌వాడీ, గ్రామ పంచాయతీ, హెల్త్ సెంటర్ భవనాలు నిర్మించామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. గత బీఆర్ఎస్ హయాంలో కొన్నూరు జెడ్పీహెచ్ఎస్‌కు మనఊరు-మనబడి కార్యక్రమం కింద రూ.57.30లక్షలు, ప్రాథమిక పాఠశాలకు రూ.8.77లక్షలు మొత్తం 66.7లక్షలు మంజూరు కాగా గ్రామానికి కొందరు దాతలు రూ.20లక్షల తమవంతు సహకారం అందించారు. గ్రామానికి చెందిన ఓ కాంగ్రెస్ నాయకుడు రూ.కోటి 15లక్షలతో స్కూల్ బిల్డింగ్ నిర్మించానని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. కాంగ్రెస్ నాయకులు ఆడుతున్న నాటకాలను ప్రజలు గమనిస్తున్నారని, త్వరలోనే వారికి రాజకీయపరంగా నూకలు చెల్లే కాలం అసన్నమైంద న్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు అచ్యుతారెడ్డి, యువ నాయకుడు మహేశ్, సీనియర్ నాయకులు పెంటయ్య, గోవర్ధన్, కురుమయ్య, మొగిలన్న, ఆశన్న, నర్సింహ, రాములు తదితరులు పాల్గొన్నారు.

అ'పూర్వ' కలయిక

కొత్తకోట, ఆగస్టు 12 : 1998-99 ఏడాదిలో పదో తరగతి చదివిన విద్యార్థులు 25 ఏండ్ల తర్వాత సోమవారం ఒకచోట కలుసుకొని సిల్వర్ జూబ్లీ కార్యక్రమాన్ని నిర్వహించుకున్నారు. పట్టణంలోని కేపీఎస్‌లో చదివిన పూర్వ విద్యార్థులు వారికి చదువు చెప్పిన గురువులను సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రాజావర్ధన్‌రెడ్డి, అశోక్, ఖదీర్, శ్రీశైలం చారి, పూర్వ విద్యార్థులు నరేశ్‌సాగర్, విశ్వనాథం, ఆంజనేయులు, జగదీశ్, రాము, రమ్య, శ్వేత, పల్లవి, ప్రశాంతి పాల్గొన్నారు.